సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి


కాచిగూడలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్


నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా బీజేపీ నగర నాయకులు సుభాష్ పటేల్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడలో పాపన్నగౌడ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, కృష్ణాగౌడ్, శ్యామ్ రాజ్, అరవింద్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, కృష్ణ కుమార్, శీర్‌సాగర్, ఎస్ఎస్‌రాము, రవీంధర్ గౌడ్, ఆర్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల చైతన్యానికి కృషి

అంబర్‌పేట్: బడుగు బలహీన వర్గాల చైతన్యానికి సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్ చేసిన కృషి చిరస్మరణీయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాగ్ అంబర్‌పేట్‌లో బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి రోహిత్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో సర్వాయిసర్దార్ పాపన్నగౌడ్ వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి కృష్ణయాదవ్, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు ఎస్.గౌతమ్‌రావుతో కలిసి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తి నేటితరానికి ఆదర్శం అన్నారు. నాయకులు చుక్క జగన్, కృష్ణగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, అచ్చిని రమేశ్, రంగంపల్లి రాజు, వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ కల్లుగీత సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 314 వర్ధంతి సభను మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.వీ.రమణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ట్యాంక్‌బండ్‌పైన పాపన్న విగ్రహాన్ని నెలకొల్పి చట్టసభల్లో గౌడలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. గౌడ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌనీ బాలరాజ్‌గౌడ్, సమన్వయ కమిటీ కన్వీనర్ వెంకన్నగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్‌కుమార్‌గౌడ్, హర్షవర్ధన్‌గౌడ్, జి.రాములు, ఆర్.శ్రీరామ్‌నాయక్, కోట రమేష్, శోభన్‌నాయక్, అబ్బగాని బిక్షం, భూపతివెంకటేశ్వర్లు, గుమ్మడి రాజు నరేష్, వెంకటనర్సయ్య తదితరులున్నారు.

సామాజిక లక్ష్యసాధనే పాపన్నకు నిజమైన నివాళి..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక లక్ష్య సాధనే పాపన్నకు ఇచ్చే నిజమైన నివాళి అని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటి చైర్మన్ బాలగౌనీ బాలరాజ్‌గౌడ్ అన్నారు. మంగళవారం చిక్కడపల్లిలోని కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో సర్దార్ సర్వాయి పాపన్న 314 వర్ధంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గౌడ సంఘాలకు పార్లమెంటు ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వైన్స్ షాపుల్లో గౌడ్‌లకు 25 శాతం వాటా కల్పించాలని ప్రమాదవశాత్తు మృతి చెందిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. సమన్వయ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు గౌడలను చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. దళిత బహుజనులను ఐక్యం చేసి రాజ్యాన్ని ఎలా సాధించాలో పాపన్నగౌడ్ స్ఫూర్తిని ఇచ్చారన్నారు. వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్‌గౌడ్, సమన్వయ కమిటి వైస్ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్, తెలంగాణ గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగౌనీ వెంకటేష్‌గౌడ్, హర్షవర్ధన్‌గౌడ్ తదితరులున్నారు.

స్ఫూర్తి ప్రదాత సర్వాయి పాపన్నగౌడ్

కాచిగూడ: బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి గోల్కొండ కోటతో పాటు తెలంగాణ ప్రాంతంలో 32 కోటలను జయించి బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన భారతదేశ తొలి గొప్ప బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్నగౌడ్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి ప్రదాత అని జై గౌడ్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని శంకర్‌గౌడ్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314వ వర్ధంతి సందర్భంగా మంగళవారం కాచిగూడ, నింబోలిఅడ్డలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బహుజనులకు రాజ్యాధికారం కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి సర్వాయి పాపన్నగౌడ్ అని కొనియాడారు. జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావు, సత్యం గౌడ్, గంగ్రాతి సత్యనారాయణగౌడ్, మధుసూదన్‌గౌడ్, రాజేష్, గందమల్ల ఆనంద్, కన్నె ఉమారమేష్‌యాదవ్, ముద్దగోని రాంమోహన్‌గౌడ్, దూసరి వెంకటేష్ తదితరులున్నారు.


సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో..


చిక్కడపల్లి కమిటీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న బాలరాజ్‌గౌడ్


నివాళులర్పిస్తున్న జై గౌడ్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌గౌడ్

ప్రతిభ ఉంటే వెన్నంటే అవకాశాలు



కాచిగూడ: ప్రతిభ గల విద్యార్థులకు అవకాశాలు వెన్నంటే ఉంటాయని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ డాక్టర్ చంద్రుడు చిలుకూరు అన్నారు. మంగళవారం నారాయణగూడలోని శ్రీ వేంకటేశ్వర కామర్స్ డిగ్రీ కాలేజీలో 'వాణిజ్య శాస్త్రం - ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి శ్రీ వేంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కామర్స్ డిగ్రీ కాలేజెస్ చైర్మన్ పమ్మి సుధాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. పారిశ్రామికీకరణతో కామర్స్ విద్యార్థులకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతుందని డాక్టర్ చంద్రుడు వెల్లడించారు. పారిశ్రామిక రంగానికి అవసరమయ్యే స్కిల్స్‌ను విద్యార్థులు ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని సూచించారు. కేవలం పుస్తకాల్లోని విషయ పరిజ్ఞానమే కాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా నేర్చుకోవాలన్నారు. ఉపాధి వెతుక్కోకుండా 10 మందికి ఉపాధిని ఇచ్చేలా విద్యార్థులు అవకాశాలను సృష్టించాలన్నారు. డాక్టర్ ఎస్ సూర్యప్రకాష్, కృష్ణారెడ్డి, గీతారామ్, రాగినీ సింగ్, సీహెచ్ సావిత్రి, అనుపమ, సీహెచ్ అపర్ణ, రమణాచారి, ప్రియాంక, తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ సందేహాలు, పోటీ పరీక్షలకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మరోసారి గెలిపిస్తే అభివృద్ధికి కృషిచేస్తా


మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట్: అంబర్‌పేట ప్రజల ఆశీర్వాదంతోనే తాను పార్లమెంటుకు వెళ్లానని మారోసారి వెళ్లేందుకు ఆశీర్వదించాలని సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. మంగళవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని అంబర్‌పేట డివిజన్, మున్సిపాల్ కాలనీ, ఒవైసీ నగర్, చెన్నారెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేశారు. కాలనీ, బస్తీ పెద్దలతో ప్రత్యేకంగా సమావేశమై కేంద్ర ప్రభుత్వం దేశం కోసం చేసిన కృషి, అమలు చేసిన పథకాలను వివరించారు. తనపై బాధ్యత ఉంచి పార్లమెంటుకు పంపారని దానిని చిత్తశుద్ధితో విధులు నిర్వహించినట్లు చెప్పారు. ఒక పార్లమెంటు సభ్యుడిగా నైతిక విలువలతో బాధ్యతలు నిర్వహించానని, మరోసారి గెలిపిస్తే సికింద్రాబాద్ పార్లమెంటుతో పాటు దేశాభివృద్ధిలో మీ అండతో భాగస్వామిని అవుతానన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, నాయకులు నాగభుషణం చారి, కృష్ణగౌడ్, యశ్వంత్, రాంచందర్‌గుప్తా, వెంకటేష్, మనోజ్, దయాకర్‌యాదవ్ తదితరులున్నారు.

'సామాజిక సేవలో ఆర్యవైశ్యులు ముందంజ'


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ముషీరాబాద్: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందుంటారని అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య హాస్టల్ భవనంలో వాసవీ మహిళా సంఘం చిక్కడపల్లి ఆధ్వర్యంలో మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అప్పుడే దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేసి ఘనంగా సన్మానించారు. వాసవీ మహిళా సంఘం చిక్కడపల్లి అధ్యక్షురాలు శ్రీరాం విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మాలతీ, కోశాధికారి వసంత తదితరులున్నారు.

చెత్త రహిత మహానగరంగా తీర్చిదిద్దుతాం


చిరు వ్యాపారులకు సూచనలు చేస్తున్న జీహెచ్ఎంసీ సర్కిల్-15 ఏఎంహెచ్ఓ డాక్టర్ మైత్రేయి

ముషీరాబాద్: నగరాన్ని చెత్త రహిత మహానగరంగా తీర్చిదిద్దడంలో ప్రజలంతా స్వచ్ఛంగా భాగస్వాములు కావాలని జీహెచ్ఎంసీ సర్కిల్-15 ఏఎంహెచ్ఓ డాక్టర్ మైత్రేయి సూచించారు. మంగళవారం స్వచ్ఛతవైపు ఒక అడుగు పేరిట జీహెచ్ఎంసీ చేపడుతున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులతో కలిసి ముషీరాబాద్, భోలక్‌పూర్, రాంనగర్ ప్రాంతాల్లో డాక్టర్ మైత్రేయి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్డుపై చెత్త వేయకుండా చెత్తను సేకరించే రిక్షా కార్మికులకు చెత్తను అందజేయాలని వ్యాపారులు, తోపుడు బండ్ల నిర్వాహకులకు సూచించారు. లేనిపక్షంలో జరిమానా విధిస్తామని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు జూన్ 2 వరకు జీహెచ్ఎంసీ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. జీహెచ్ఎంసీ శానిటైజేషన్ సూపర్‌వైజర్ గోవర్ధన్, శానిటైజేషన్ ఫీల్డ్ ఆఫీసర్లు రమేష్‌శేఖర్, అహ్మద్ తదితరులున్నారు.

బీసీలంతా నీలం మధుకు మద్దతివ్వాలి


రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను కలిసిన మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్

- బీసీలంతా నీలం మధుకు మద్దతివ్వాలి
- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: బీసీలు అందరూ ఏకమై మెదక్ పార్లమెంటు అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీసీ సంఘం జాతీయ నేత, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కోరారు. మంగళవారం తన నివాసానికి వచ్చిన నీలం మధును కృష్ణయ్య అభినందించారు. లోక్‌సభ ఎన్నికల్లో తనకు మద్దతివ్వాలని మధు కోరగా..స్పందించిన కృష్ణయ్య తప్పకుండా తమ సహకారం ఉంటుందని చెప్పారు. దశాబ్దాలుగా మెదక్ ప్రాంతంలో అగ్రవర్ణాలే రాజ్యమేలుతున్నాయని, ఇప్పుడు బీసీ సామాజిక వర్గానికి చెందిన యువ నేత నీలం మధుకు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అరుదైన అవకాశం రావడం హర్షణీయమన్నారు. మెదక్ పార్లమెంటు పరిధిలో 64 శాతం బీసీల ఓట్లు ఉన్నాయని చెప్పారు. యువనేత నీలం మధును గుర్తించి కాంగ్రెస్ టికెట్ ఇవ్వడం సంతోషం కలిగించిందన్నారు. ఈ ఎన్నికల్లో నీలం మధును గెలిపించుకుంటే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీసీ వర్గాలను గెలిపించుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. మధును పార్లమెంటుకు పంపితే ఆయన మద్దతు తీసుకుని దేశవ్యాప్తంగా బీసీల హక్కుల కోసం పోరాడుతామని ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ముందుగా ఆర్.కృష్ణయ్యతో పాటు బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ సంఘం నాయకులు సుధాకర్ ముదిరాజ్, నందగోపాల్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వేముల రామకృష్ణ తదితరులు నీలం మధును శాలువాలతో సన్మానించి సంఘీభావం తెలిపారు.

స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరుతో మోసం

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు భారీ మోసం చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ వ్యక్తికి స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టాలని వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపించారు. వారు చెప్పినట్లుగానే బాధితుడు మొదటగా కొంత పెట్టుబడి పెట్టాడు. వాటికి లాభాలు వచ్చాయని నమ్మించారు. అనంతరం మరిన్ని లాభాల కోసం వెల్త్ మేనేజ్‌మెంట్‌లో రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టమని బాధితుడికి చెప్పారు. బాధితుడికి ఏడాది పాటు వడ్డీ లేకుండా వర్చువల్ లోన్ ఇచ్చినట్లు చూపించారు. లాభాలకు ఆశపడి బాధితుడు రూ.21.7 లక్షలు డిపాజిట్ చేశాడు. అనంతరం బాధితుడు రూ.2.2 లక్షలను లాభంగా విత్‌డ్రా చేసుకున్నాడు. మరోసారి బాధితుడు రూ.7 లక్షలు విత్‌డ్రా చేసేందుకు ప్రయత్నించాడు. ఆ డబ్బు విత్‌డ్రా కాకపోవడంతో బాధితుడు రూ.19, 50,000 మోసపోయానని గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.

మధుబాపు శాస్త్రికి సన్మానం


సన్మానిస్తున్న వంశీ రామరాజు, రామసత్యనారాయణ తదితరులు

చిక్కడపల్లి: 24 గంటల పాటు ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన పాటలు పాడి రికార్డు సృష్టించిన మధుబాపు శాస్త్రి అభినందనీయులని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. మనిషా ఆర్ట్స్ ఆధ్వర్యంలో వంశీ ఇంటర్నేషనల్ అభినందనలతో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో శోభన్‌బాబు వంశీ మ్యూజిక్ అవార్డు-2024ను గాయకుడు మధుబాపుశాస్త్రికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రదానం చేసి సన్మానించారు. సినీ సంగీత విభావరిలో గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న పాటలను మధురంగా ఆలపించి అలరించారు. సినీ నిర్మాత రామసత్యనారాయణ, ప్రముఖులు కృష్ణప్రసాద్, శ్రీధర్, ఆత్రేయ, శ్రీదేవి, రేవతి, శ్రీకాంత్, స్వప్న, డాక్టర్ సాయిసింధూర తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివ్యాంగ, బదిర ఉద్యోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి భారతి, ఉపాధ్యక్షులు కాటమోని వెంకటప్రసాద్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం సొసైటీ ఫర్ ది డెఫ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజుకు ఈ విషయమై వినతిపత్రం అందజేశామన్నారు. రాష్ట్రంలో అన్ని శాఖల్లో పనిచేస్తున్న దివ్యాంగ ఉద్యోగులకు ఎలాంటి విధులు కేటాయించొద్దని భారత ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు వెలువడినా.. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారన్నారు. ఉద్యోగ నియామకం సమయంలో రోస్టర్ పాయింట్ 31 ద్వారా ఎంపికైన వీరిని పూర్తిగా బదిర దివ్యాంగ ఉద్యోగులకు చెందిన వారు కాబట్టి వచ్చే ఎన్నికల్లో విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని వారు కోరారు.


మాట్లాడుతున్న డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్

డైట్ బిల్లులు చెల్లించాలి


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గత తొమ్మిది నెలలుగా ప్రభుత్వం డైట్ బిల్లులు ఇవ్వకపోతే సంక్షేమ వసతి గృహాలను ఎలా నిర్వహిస్తారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ప్రశ్నించారు. బిల్లులు మంజూరు కేవలం తెల్లపేపర్లల్లో చూడటానికి మాత్రమే కనిపిస్తున్నాయని సంక్షేమ వసతి గృహాల అధికారుల అకౌంట్లలో డబ్బులు పడటం లేదని ఆరోపించారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా 42వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా డైట్ బిల్లులు సకాలంలో ఇవ్వని కారణంగా సంక్షేమ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడానికి వీలు కావడం లేదన్నారు. దీన్ని వల్ల విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరం పూర్తి కావస్తున్న బిల్లులు చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, ఆశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీమాన్, నాగేందర్, వీరేందర్, సునీల్, ప్రశాంత్, స్టాలిన్, రమ్య పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన శిక్ష

రౌడీషీటర్లకు ఇన్‌స్పెక్టర్ కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ సీతయ్య

చిక్కడపల్లి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నేరాలకు పాల్పడితే కఠినశిక్ష విధిస్తామని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య రౌడీషీటర్లను హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన ఆయన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రేరేపిత చర్యలు చేపట్టకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించి వారికి పలు సూచనలు చేశారు.

సోదరిని దుర్భాషలాడిన వ్యక్తికి జైలు..

ఆస్తి తగాదాల విషయంలో సోదరిని దుర్భాషలాడిన సోదరుడికి జడ్జి రెండ్రోజుల జైలు శిక్ష విధించారు. శ్రీనివాస్ అనే వ్యక్తి చిక్కడపల్లిలోని తన సోదరి ఇంటికి వచ్చి ఆస్తి విషయమై ఆమెతో గొడవకు దిగి దుర్భాషలాడారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి 15వ స్పెషల్ ఎంఎం కోర్టుతో హాజరు పరచడంతో జడ్జి అతడికి రెండ్రోజుల జైలుశిక్ష విధింటినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

సినిమా థియేటర్‌లో తనిఖీలు..

ఎన్నికల కోడ్ నేపథ్యంలో చిక్కడపల్లి పోలీసులు మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సినిమా థియేటర్‌లో రోడ్లపై వాహనాల తనిఖీలను సెంట్రల్ జోన్ డీసీపీ అకాన్ష్‌యాదవ్ పర్యవేక్షించారు. ప్లాస్టిక్ సర్వేలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టీ) ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేయడంతో పాటు వాహనదారులు థియేటర్ యాజమాన్యాలు సిబ్బందికి పలు సూచనలు చేశారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా డబ్బులు ఇతర ఉచితాలు సరఫరా జరగకుండా చూడాలని సరైన పత్రాలు లేకుండా ఎవరైనా రూ.50 వేలకు మించి తీసుకెళ్తే ఆ నగదును సీజ్ చేయాలని డీసీపీ పోలీసులకు సూచించారు. చిక్కడపల్లి పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ ఎల్.రమేష్ కుమార్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేస్తే జరిమానా

చిక్కడపల్లి: స్వచ్ఛ ఆటోలకే చెత్తను ఇవ్వాలని, ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే జరిమానా తప్పదని సర్కిల్-15 ఎంహెచ్‌ఓ మైత్రేయి హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం ఆమె సాక్షితో మాట్లాడుతూ నియోజకవర్గంలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా గాంధీనగర్, కవాడిగూడ, భోలక్‌పూర్, ముషీరాబాద్, రాంనగర్, అడిక్‌మెట్ తదితర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే బయట, షాపులు, వాణిజ్య వ్యాపార కేంద్రాల వద్ద రోడ్లపై చెత్త పడవేసిన వారికి రూ.20 వేల వరకు జరిమానా విధించామన్నారు.

మరోసారి ప్రధానిగా నరేంద్రమోదీ

కాచిగూడ: దేశ ప్రజలంతా ప్రధానమంత్రి నరేంద్రమోదీని మరోసారి ప్రధానిగా చూడాలని కోరుకుంటున్నారని, దీనికోసం బహుజనులందరూ ఈ ఎన్నికల్లో ప్రజల్లోకి విస్తృతంగా ప్రధాని చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను తీసుకెళ్లాలన్నారు. బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా కాచిగూడలోని ఓబీసీ సెంట్రల్ కమిటీ కార్యాలయంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికసిత్ భారత్, రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తిగా నరేంద్రమోదీ అన్నివర్గాల ప్రజలు ఆదరించి తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాలను గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మహేష్‌గౌడ్, యాదమ్మగౌడ్, మంగళగిరి శ్వేత, లలితా తదితరులున్నారు.

ఘనంగా సాహితీ దివస్




ప్రిన్సిపల్ డాక్టర్ సృజన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎంబీఏ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సాహితి దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది అమరులు త్యాగం చేశారని వారి గుర్తింపుగా సాహితి దివస్‌ను జరుపుకోవడం గర్వకారణమన్నారు. విద్యార్థులు మన దేశం యొక్క ఔనత్యాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అమరవీరుల త్యాగాల స్ఫూర్తిగా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ కుమారస్వామి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మట్టా శేఖర్ తదితరులున్నారు.

లక్ష్యానికి మించి ఆస్తిపన్ను వసూలు


ఆస్తిపన్నును స్వీకరిస్తున్న డీఎంసీ మారుతీదివాకర్

అంబర్‌పేట్: జీహెచ్ఎంసీ సర్కిల్-16 అధికారులు లక్ష్యం చేరుకున్నారు. ఆస్తిపన్ను వసూళ్లలో లక్ష్యానికి మించి వసూలు చేశారు. గతనెల మార్చి 31 గడువు ముగిసేలోపు ఆస్తిపన్నును వసూలు చేసి సికింద్రాబాద్ జోనల్ పరిధిలోనే మొదటి స్థానంలో నిలిచారు. డీఎంసీ మారూతీ దివాకర్ పర్యవేక్షణలో సిబ్బంది పన్ను వసూలును అనుకున్న లక్ష్యానికి మించి వసూలు చేశారు. సర్కిల్-16 కు రూ.53.65 కోట్లు వసూలు లక్ష్యం కాగా.. రూ.62.11 కోట్లు వసూలు చేశారు. దీంతో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ ప్రత్యేకంగా తమ సర్కిల్ సిబ్బందిని అభినందించినట్లు డీఎంసీ మంగళవారం తెలిపారు. ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం రాయితీ కల్పించడంతో చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకున్నారన్నారు.

కిషన్‌రెడ్డి గెలుపు ఖాయం


ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గెలుపు ఖాయమని కాచిగూడ డివిజన్ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం కాచిగూడ డివిజన్ బర్కత్‌పురలోని అపార్ట్‌మెంట్ వాసులతో కిషన్‌రెడ్డి భార్య కావ్యాకిషన్‌రెడ్డితో కలిసి కార్పొరేటర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీతోనే సికింద్రాబాద్ అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, సుభాష్ పటేల్, కృష్ణకుమార్, శీర్‌సాగర్, మల్లికార్జున్, హజారిబాబు, అశోక్ కులకర్ణి, అరవింద్, భీమ్‌రాజ్, బల్వీర్, ఎస్.రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కచ్చామోరీ మరమ్మతులు


పనులను పర్యవేక్షిస్తున్న జీహెచ్ఎంసీ డీఈ రఘు, ఏఈ సబిత

కాచిగూడ: గోల్నాక డివిజన్ నింబోలిఅడ్డ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద గత కొంత కాలంగా వర్షపునీరు పోవడానికి ఏర్పాటు చేసిన క్యాష్ పిట్స్ (కచ్చామోరీ) ప్రమాదకరంగా మారింది. దీంతో నిత్యం వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాలేరు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ డీఈ రఘు, ఏఈ సబిత మంగళవారం సిబ్బందితో క్యాష్‌పిట్స్ మరమ్మతు పనులను ప్రారంభించారు. అధికారులతో కలిసి పనులను త్వరితగతిన పూర్తి చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని బీఆర్ఎస్ సీనియర్ నేత సంతోష్ తెలిపారు.

రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం... యాకత్‌పురా - ఉప్పుగూడ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (55) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ఒంటిపైన లైట్‌గ్రీన్ కలర్ ఫ్యాంటు, బ్రౌన్ కలర్ ఫుల్ షర్టు ఉంది. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.